క్లుప్తంగా

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి పంచహారతులు చేసి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ దాత సంగానరసింహారావు, ఈవో భవాని పలువురు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి



పెనమలూరు: ఈ నెల నెల 9 వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు పిలుపునిచ్చారు. అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ మండల కమిటీ అధ్వర్యంలో బైక్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ అన్ని గ్రామాల్లో తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో సీఐటీయూ నేతలు షేక్.కాశిం, గోపిమూర్తి, షేక్.బాబు, ఏడుకొండలు, రత్నకర్ణ, వేణు, సత్యనారాయణ, సింహాచలం, పాతాళలక్ష్మీ, నాగమణి పలువురు పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయాలి



గన్నవరం:సీపీఐ 26వ జిల్లా మహాసభల్లో భాగంగా స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లో మంగళవారం జరగనున్న బహిరంగ సభను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...బహిరంగసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, పి. దుర్గాభవాని, దోనేపూడి శంకర్, పలువురు జిల్లా నేతలు పాల్గొంటారని చెప్పారు. తొలుత రాయ్‌నగర్ కల్యాణ మండపం నుంచి ప్రదర్శనగా బయలుదేరి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు. పార్టీ నేతలు పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి తదితరులు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్‌ను సందర్శించిన ఈడీ



విజయవాడరూరల్: నున్న గ్రామంలోని పవర్ గ్రిడ్‌ను సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1 (ఎస్ఆర్‌టీఎస్-1) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డోమన్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఈడీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా విజయవాడ వచ్చిన ఆయన తొలుత ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీకనక దుర్గా దేవిని దర్శించుకున్నారు. అనంతరం నున్నలో పవర్ గ్రిడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) ఏపీ శంకరయ్య, సీజీఎం (అడ్మినిస్ట్రేటివ్) టీవీఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అతిథి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పవర్ గ్రిడ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్న తర్వాత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు, డీజీఎం సమ్మయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే..

- శిథిలావస్థలో కల్వర్టులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- భయం భయంగా రాకపోకలు





కంకిపాడు ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో శిథిలమైన కల్వర్టులు

కంకిపాడు: కల్వర్టులు శిథిలావస్థలో ఉన్నాయి. రోడ్డు మార్జిన్‌లలో అనేక ప్రాంతాల్లో ఉన్న కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ప్రత్యేకించి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న లాకులు వద్ద కల్వర్టులు కూలిపోయి ఉండటంతో ఆ ప్రాంతం అంతా ప్రమాదభరితంగా తయారైంది. ఎప్పుడెలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కంకిపాడు ఇరిగేషన్‌సెక్షన్ పరిధిలో బందరు కాలువపై పట్టణంలో లాకులు ఉన్నాయి. బందరు, పుల్లేరు, వల్లూరు పడమటి కాలువ, వీటితో పాటుగా అనేక పంట కాలువలు దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 35 వేల ఎకరాల విస్తీర్ణం ఈ సెక్షన్ కింద ఉంది. ప్రధాన కాలువలు, పంట కాలువల మీదుగా రహదారులను నిర్మించి వాహనదారుల భద్రత నిమిత్తం కల్వర్టులను నిర్మించారు. సెక్షన్ పరిధిలోని అనేక గ్రామాలతో పాటుగా సెక్షన్ పరిసరాల్లో సైతం కల్వర్టులు శిథిలమైపోయి ఉన్నాయి. కల్వర్టులు నిర్మించి ఏళ్లు గడిచిపోవటంతో పాటుగా భారీ లోడు వాహనాలు ఢీకొనటంతో ధ్వంసమై క్రమేపీ శిథిలమయ్యాయి.

భయం భయంగా రాకపోకలు.....

రోడ్డు మార్జిన్‌లలోని కల్వర్టులు కూలిపోయి ఉండటం, ధ్వంసమై ఉండటంతో వాహనదారులు రాకపోకల సమయంలో భయాందోళనలు చెందుతున్నారు. మార్జిన్‌లు పూర్తిగా కోతకు గురై ప్రమాదకరంగా తయారయ్యాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన క్రమంలో కల్వర్టులు వద్ద ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు అదుపుతప్పితే పక్కనే ఉన్న పంట కాలువలోకి వాహనాలు దూసుకెళ్లే పరిస్థితి నెలకొంది. దీంతో ఎప్పుడెలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం వాహనదారులను వెంటాడుతోంది.

కన్నెత్తి చూడని అధికారులు....

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులను మరమ్మతులు చేయించటంలో అధికారులు చొరవ చూపటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కళ్లెదుటే ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నా స్పందించటం లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కనీసం కల్వర్టులు కూలిన ప్రదేశాల్లో తాత్కాలిక ప్రాతిపదికన కర్రలతో హెచ్చరిక గోడలను సైతం నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ప్రమాదం జరగకుండా ముందస్తు హెచ్చరిక చర్యలు చేపడితే మేలు అంటూ సూచిస్తున్నారు.

అంచనాలు రూపొందించి నివేదించాం

లాకులు, కల్వర్టుల మరమ్మతులుపై ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదించాం. అవసరమైన నిధులను మంజూరుచేయాలని కోరుతూ అంచనాలను పంపాం. నిధులు మంజూరైతే కల్వర్టుల మరమ్మతులు, ఇతర అభివృద్ధి చర్యలు చేపడతాం.

–నాగబాబు, ఏఈ, ఇరిగేషన్ సెక్షన్, కంకిపాడు

గ్రేడ్ 6 పంచాయతీ కార్యదర్శులు బదిలీ

విజయవాడరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 6 (డిజిటల్ అసిస్టెంట్లు) బదిలీలు సోమవారం జరిగాయి. నున్న 2వ సచివాలయం నుంచి బి.సూర్యతేజ పాతపాడు గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మైలవరం 1వ సచివాలయం నుంచి కె.శ్రీను బదిలీ పై వచ్చారు. నున్న గ్రామ సచివాలయం 3 నుంచి డి.శివకుమార్ అంబాపురం గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కలిదిండి మండలం పడమటిపాలెం గ్రామ సచివాలయం నుంచి బి.జ్యోతి బదిలీపై వచ్చారు. పాతపాడు గ్రామ సచివాలయం నుంచి కె.సతీష్ పి.నైనవరం గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. అంబాపురం గ్రామ సచివాలయం నుంచి సాయికుమార్ గ్రేడ్ 5 ప్రమోషన్ పొంది పోస్టు కోసం వేచి యున్నారు. పి.నైనవరం గ్రామ సచివాలయం నుంచి పి.తిరుపతిరావు కవులూరు గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు.రామవరప్పాడు గ్రామ సచివాలయం 2 నుంచి పి.సాయికుమార్ కంచికచర్ల మండలం మొగులూరు బదిలీ అయ్యారు. ప్రసాదంపాడు గ్రామ సచివాలయం 1 నుంచి ఎస్.సత్యవతి 2వ సచివాలయానికి బదిలీ అయ్యారు. ప్రసాదంపాడు 2వ గ్రామ సచివాలయం నుంచి ఎల్.ప్రియదర్శిని 3వ గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. ప్రసాదంపాడు 3వ గ్రామ సచివాలయం నుంచి వి.శ్యామ్ సుందర్ గన్నవరం మండలం తెంపల్లి గ్రామ సచివాలయానికి బదిలీ అయ్యారు. ఎనికేపాడు 2వ సచివాలయం నుంచి బి.నాగరాజు నిడమానూరు 3 సచివాలయానికి బదిలీ అయ్యారు. ఎనికేపాడు 2కి జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు 3వ సచివాలయం నుంచి ఎం.కళ్యాణి బదిలీపై వచ్చారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



నున్నలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నున్న(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణకు సహకరించిన వారిపట్ల కృతజ్ఞతగా ఉంటామని ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ మంద వేణుమాదిగ తెలిపారు. నున్న గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. వేణుమాదిగ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే వర్గీకరణ సాధించామని చెప్పారు. ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పోరాట పటిమతో ఫలితం పొందామని పేర్కొన్నారు. అందుకు కృతజ్ఞతగా ఉంటామన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భా దినోత్సవం, మంద కృష్ణమాదిగ 60వ పుట్టినరోజును గ్రామంలో జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంఈఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు, గ్రామంలోని వివిధ రాజకీయపార్టీ నాయకుల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, దేవదాసు, సుబ్బారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలి



విద్యార్థుల ఆరోగ్య రికార్డులు పరిశీలిస్తున్న నాగమల్లేశ్వరరావు

గన్నవరం రూరల్:ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ నెల 10వ తేదీ జరగనున్న మెగా పేరెంట్స్ సమావేశం నాటికి విద్యార్థుల ఎత్తు, బరువు, రక్త గ్రూపులు పరీక్షించి ఆర్‌బీఎస్‌కె కార్డులో నమోదు చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ టి.జితేంద్ర కుమార్ వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు సోమవారం హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సిబ్బందితో కలసి వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మీతో సమీక్షించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావుతో జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమంపై చర్చించారు. హెల్త్ కార్డులు పరిశీలించారు. విద్యార్థులు ప్రోగ్రెస్ కార్డుల్లో వివరాలు నమోదు చేయాల్సి ఉందని, ఆరోగ్య సిబ్బంది ఈ విషయంపై పూర్తిగా దృష్టి సారించినట్లు చెప్పారు. ఎంపీపీ పాఠశాలల్లో హెచ్ఎంలు కిరణ్, ఎం.సరళ రాణీలు హెల్త్ కార్డులు నమోదు చేశారు.

దాతల చేయూత అభినందనీయం



పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్‌లను అందజేస్తున్న ధనయ్య, దాతలు గాంధీ, కిషోర్

కంకిపాడు: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల చేయూత అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని ఉప్పలూరు జెడ్పీ పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు కొల్లి గాంధీ, కొల్లి కిషోర్ నాలుగు సీలింగ్ ఫ్యాన్‌లను సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ధనయ్య మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అవసరమన్నారు. సమాజ అభ్యున్నతిలో దాతల పాత్ర చాలా కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాతినేని వరప్రసాదరావు, ఉషాకుమారి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి చర్యలు



పెనమలూరు:పోరంకిలో పలు రోడ్లను ఎమ్మెల్యే బోడెప్రసాద్ సోమవారం ప్రారంభించారు. తాడిగడప మున్సిపాలిటీ నిధులతో విష్ణుపురం కాలనీలో గత మూడు సంవత్సరాల నుంచి నేటి వరకు నిర్మించిన పలు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలనీ వాసులు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.1.03 లక్షల విరాళం



గన్నవరం:మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల ఉమ్మడి హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి స్థానిక విద్యానగర్‌కు చెందిన పాట్లూరి శ్రీనివాసరావు రూ. 1,03,697 విరాళం ఇచ్చారు. ఈ మేరకు సోమవారం సీనియర్ న్యాయవాది కేవీ రమణతో కలిసి శ్రీనివాసరావు విరాళం నగదును శ్మశాన వాటిక నిర్మాణ కమిటీకి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇటీవల అకాల మరణం చెందిన శ్రీనివాసరావు కుమారుడు ఆనందభార్గవ్ జ్ఞాపకార్థం హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి తమ వంతు సాయం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, దాతల సహకారంతో శ్మశాన వాటికను అధునిక హంగులతో తీర్చిదిద్దుతున్న నిర్మాణ కమిటీని ఆయన అభినందించారు. వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, నిర్మాణ కమిటీకి చెందిన కారంపూడి సుబ్బారావు, గుర్రం నరసయ్య, గొంది పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్లాట్-2025 ర్యాంకర్ ఇందుశ్రీకి అభినందన



హనుమాన్‌జంక్షన్ రూరల్:కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) - 2025 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించి విశాఖపట్టణంలోని ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీలో సీటు సంపాదించిన బాణావతు ఇందుశ్రీని పలువురు సత్కరించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాణావతు వెంకట్రామ్ నాయక్ కుమార్తె ఇందుశ్రీ క్లాట్ ఫలితాల్లో ఆలిండియా 716 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆమె విద్యాభ్యాసం చేసిన సిద్ధార్థ విద్యాలయ (హనుమాన్‌జంక్షన్), శరత్‌చంద్ర జూనియర్ కాలేజి (విజయవాడ) ఆధ్వర్యంలో సోమవారం సన్మానం నిర్వహించారు. ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీలో సీటు సాధించటం ఈ ప్రాంతానికి గర్వకారణమని చెప్పారు. ఇందుశ్రీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు. భవిష్యత్‌లో జడ్జిగా ఎంపిక కావటమే తన లక్ష్యమని ఇందుశ్రీ చెప్పారు. సిద్ధార్థ విద్యాలయ ప్రిన్సిపాల్ వీరమాచినేని ధనలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాలి బాలస్వామి, తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీదేవి, శరత్‌చంద్ర కాలేజి ప్రతినిధి దత్ పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న వక్ఫ్‌భూములను స్వాధీనం చేసుకోవాలి

కంకిపాడు: ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలని ఉమ్మడి కృష్ణా జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ వైస్ చైర్మన్ షేక్ చిన్నా విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వి.భావనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ మండలంలోని ప్రస్తుత చలివేంద్రపాలెం గ్రామం ఒకప్పుడు తానీషా పాలెంగా ఉండేదన్నారు. ఇక్కడ ఉన్న మసీదుకు 33 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. వక్ఫ్‌బోర్డులోనూ వక్ఫ్ ఆస్తిగా ఉందన్నారు. కానీ నేడు ఆ భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఆక్రమణకు గురైన భూములను తక్షణమే సర్వే చేసి గుర్తించాలన్నారు. సంబంధిత యజమానుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం పక్కదారి పట్టించిన భూములను పరిరక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

రేపటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 9 నుంచి పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిడమానూరు పశు వైద్యాధికారి కె. సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. 9న నిడమానూరు పశు వైద్యశాల వద్ద, 10న ఎనికేపాడు రైతు సేవా కేంద్రం , 11న ప్రసాదంపాడు పశు వైద్యశాల, 14న రామవరప్పాడులో జరుగుతాయని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు, రేపు ఉయ్యూరులో బీఎల్‌వోల సమావేశం

కంకిపాడు: బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 8, 9 తేదీల్లో ఉయ్యూరు జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. బీఎల్‌ఓలు ప్రతి ఒక్కరూ ఈ సమావేశాలకు హాజరుకావాలని సూచించారు.

10న శాకంబరీ ఉత్సవం

గన్నవరం:స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 10వ తేదీన శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ, ఉపదేవత అంకమ్మ తల్లికి శాకంబరీ అలంకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. శాకంబరీ అలంకరణ నిమిత్తం కూరగాయలు ఇచ్చే దాతలు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నంలోగా ఆలయంలో సమర్పించాలని కోరారు.

యూఎఫ్ ఆర్‌టీఐ కోస్తా జిల్లాల అధ్యక్షుడుగా బేతపూడి

ఉయ్యూరు: యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ కోస్తా జిల్లాల అధ్యక్షుడుగా బేతపూడి జోగేశ్వరరావు నియమితులయ్యారు. ఉయ్యూరు మండలం ఆనందపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త జోగేశ్వరరావుకు ఈ నియామకపత్రాన్ని యుఎఫ్ ఆర్ఐటీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి ఇమ్మానుయేలు, కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

పెనమలూరు:గంగూరు వద్ద జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగికి గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... ఉయ్యూకుకు చెందిన చొప్పిడి శ్రీనివాసరావు మచిలీపట్నం కలెక్టరేట్‌లో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. గుణదలలో బంధువులు చనిపోవటంతో ఉయ్యూరు నుంచి బైక్ పై విజయాడకు బయలుదేరాడు. గంగూరు చేపలకుండీల వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని బైక్ ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ఘటనలో శ్రీనివాసరావు తలకు గాయాలు అయ్యాయి. స్థానికుల ద్వారా ఫోన్ సమాచారం తెలుసుకున్న బాధితుడి భార్య నాగమణి కుటుంబ సభ్యులు పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఈ ఘటనే పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గండ్లు వెంటనే పూడ్చాలి

ఉంగుటూరు(గన్నవరం):ఉంగుటూరు మండల పరిధిలో బుడమేరు కాలువకు పడిన గండ్లను ప్రభుత్వం వెంటనే పూడ్చివేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ నేతలు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీరా వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది వరదలు కారణంగా మండలంలోని పలు చోట్ల బుడమేరు కాలువకు భారీ గండ్లు పడ్డాయని చెప్పారు. ఏడాది గడుస్తున్నా ఈ గండ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరో విపత్తు రాకుండా తక్షణం బుడమేరు కాలువకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు మాగంటి సాంబశివరావు, టి. రామ్మోహన్‌రావు, సలీం, పి. రాజారావు, పి. శ్రీను, పి. మహేష్, వెంకటరమణ పాల్గొన్నారు.